కవి సమ్మేళనం

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 6 : ఆకాశవాణిని ముందుతరాలకు అందించేలా తీర్చిదిద్దాలని సంస్థ మాజీ డైరెక్టర్ జనరల్ ఎస్. వేణుధర్‌రెడ్డి అన్నారు. శనివారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలోని ఎస్‌టీఆర్ కళామందిరంలో ఆకాశవాణి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉగాది కవి సమ్మేళనాన్ని రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి అధ్యక్షతన నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త మైలవరపు శ్రీనివాస్, దూరదర్శన్ మాజీ డీడీజీ డాక్టర్ ఎ. పద్మనాభరావు, భాషా సంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, స్పిర్చువల్ సైంటిస్ట్ వీఎస్‌ఆర్ మూర్తి, ఆకాశవాణి ఉదయ్ ప్రసంగించారు. కవి సమ్మేళనంలో కవులు కొలకనూరి ఇనాక్, ఎన్.గోపి, ఎస్. శరత్ జ్యోత్స్నారాణి, శిఖామణి, వడ్డేపల్లి కృష్ణ, జొన్నవిత్తుల రామలింగేశ్వర్‌రావు, ఐనంపూడి లక్ష్మి తమ కవితలు వినిపించి సభికులను అలరించారు.

సన్మానం

న్యాయవాదుల మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది ఆళ్లగడ్డ అనిల్‌కుమార్‌ను తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యుడు ఉపేందర్, రాష్ట్ర పుడ్ సెక్యూరిటీ సభ్యుడు, న్యాయవాది కొంతం గోవర్ధన్‌రెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. రవికుమార్, అడిషనల్ పీపీ తిరుపతి వర్మ, ముకుందరెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

- కవాడిగూడ, ఏప్రిల్ 6

ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్ కోల్పోయింది

కవాడిగూడ, ఏప్రిల్ 6 : మాదిగలను ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్ పార్టీ కోల్పోయిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్‌మాదిగ అన్నారు. మాలలను నెత్తిమీద పెట్టుకోవడం, మాదిగలను పాదాల కింద అణిచివేయడం కాంగ్రెస్ నైజమని ఆయన మండిపడ్డారు. ఆత్మగౌరవం ఉన్న మాదిగలెవరూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని ఆయన పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు సీట్లు కేటాయించకుండా అవమానించడాన్ని నిరసిస్తూ శనివారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్‌ఎఫ్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నాను నిర్వహించారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మాదిగల సత్తా ఏమిటో చూపెడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సీహెచ్ సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర నాయకులు ఏర్పుల విష్ణు మాదిగ, అజిత్ వాల్మీకి, కిషన్ మాదిగ, శివ మాదిగ, అరుణ్ మాదిగ, అనిల్ మాదిగ, రామకృష్ణ, రాజశేఖర్ మాదిగ, ఆదిత్య, సుజాత, సరోజ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలి

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్సీ ఎంఎస్. ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం నాంపల్లి నియోజకవర్గం మెహిదీపట్నం డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ హెచ్.సంతోష్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్సీ ఎంఎస్.ప్రభాకర్ రావు ఆయనకు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. **- మెహిదీపట్నం, ఏప్రిల్ 6**

కానిస్టేబుల్‌కు క్యాష్ రివార్డు

హైదరాబాద్ సీసీఎస్ క్రైం కానిస్టేబుల్ మహ్మద్ ఇమ్రాన్‌కు దొంగ కార్ల అమ్మకాలకు సంబంధించిన మిస్టరీని ఛేదించినందుకు శనివారం నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి క్యాష్ రివార్డును అందించి అభినందించారు. **- మెహిదీపట్నం, ఏప్రిల్ 6**

మెహిదీపట్నంలోని జి.పుల్లారెడ్డి డిగ్రీ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని డిగ్రీ, పిజీ కళాశాల కోశాధికారి జి. ఏకాంబరరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటయ్య పాల్గొన్నారు.

- మెహిదీపట్నం, ఏప్రిల్ 6

దాహార్తిని తీర్చేందుకు.. చలివేంద్రాలు

అంబర్‌పేట, ఏప్రిల్ 6 : ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ధర్మశాస్తా సేవా సంఘం వ్యవస్థాపకులు ఎం. చంద్రమౌళి గురుస్వామి, ఎన్.స్వామిల ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేటలోని గురువాయూర్ శ్రీకృష్ణ మందిర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అవసరమైన చోట చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.సాంబశివగౌడ్, సంస్థ ప్రతినిధులు పి.నర్సింగ్‌రావు, ఎం.సత్యనారాయణ, యాదగిరి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, నాయకులు మిర్యాల శ్రీను, వెంకట రమణ రాజు, టి.రమేశ్, కోట్ల సంతోష్, నరహరి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డితో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించిన అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అన్నమాచార్య ఆరాధనోత్సవాలు

ట్యాంక్‌బండ్‌పై గల అన్నమాచార్య విగ్రహం వద్ద సంకీర్తనలు ఆలపిస్తున్న పద్మశ్రీ డాక్టర్ శోభరాజు

కవాడిగూడ, ఏప్రిల్ 6 : అన్నమయ్య సంకీర్తనలకు ప్రాచుర్యం కల్పించి ప్రతి ఒక్కరిలో భక్తి బావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు పద్మశ్రీ డాక్టర్ శోభరాజు అన్నారు. 521వ అన్నమాచార్య ఆరాధన (అన్నమయ్య వర్ధంతి) ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య భవనా వాహిణి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు చిక్కడపల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి నగర సంకీర్తన ప్రారంభమై ఉదయం 7 గంటల వరకు ట్యాంక్‌బండ్‌పై ఉన్న అన్నమాచార్య విగ్రహం వరకు డాక్టర్ శోభరాజు వారి శిష్యబృందంతో భక్తిగీతాలు ఆలపిస్తూ చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

కార్వాన్ నియోజకవర్గం గోల్కొండలో ప్రభుత్వ పాఠశాల మైదానంలో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్, మహ్మద్ ఖాలెద్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఇఫ్తార్ విందులో పాల్గొని ప్రార్థనలను నిర్వహించారు.

- మెహిదీపట్నం, ఏప్రిల్ 6

జాతీయస్థాయి కమిషన్ ఏర్పాటుచేయాలి



వినతిపత్రం ఇస్తున్న డీఎస్‌డీ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్

చిక్కడపల్లి, ఏప్రిల్ 6 : దివ్యాంగుల కోసం జాతీయస్థాయిలో కమిషన్ ఏర్పాటు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ (డీఎస్‌డీ) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ అన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం 20 డిమాండ్లను మ్యానిఫెస్టోలో పొందుపర్చాలని కోరుతూ.. శనివారం గాంధీ భవన్ ఎన్నికల మ్యానిఫెస్టో చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాల్లో దివ్యాంగులకు ఒకే విధంగా రూ.6వేల ఫించన్ ఇవ్వాలని కోరారు. చట్ట సభల్లో ఐదు శాతం రిజర్వేషన్, దివ్యాంగుల కోసం జాతీయ స్థాయిలో కమిషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. డీఎస్‌డీ జాతీయ కో-కన్వీనర్లు వి.భారతి, కె.వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల నిర్విరామ సంగీత విభావరి

రసనాద క్రియేషన్స్ సరిగమ సంగీత అకాడమీ ఆధ్వర్యంలో మధుర గాయకుడు ఘంటసాల శత జయంతిని పురస్కరించుకొని శనివారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో నిర్వహించిన నిర్విరామ సంగీత విభావరి విశేషంగా అలరించింది. గాయకులు 101 ఘంటసాల పాటలను అలపించి రంజింప చేశారు. కార్యక్రమంలో ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ స్థాపకుడు వంశీ రామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని గాయకుడు రమణను సద్గురు ఘంటసాల గానరత్న బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో సినీనిర్మాత రామసత్యనారాయణ, దైవజ్ఞశర్మ, ప్రసాద్ పాల్గొన్నారు. **- ముషీరాబాద్, ఏప్రిల్ 6**

రెడ్డి వివాహ పరిచయ వేదికకు స్పందన

యువత ఆదర్శ వివాహాలు చేసుకున్నపుడే సమాజంలో మార్పు వస్తుందని నయోలిన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అధినేత నల్లపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సంఘసేవకులు ఎన్.శరత్‌శ్యామ్, ఎం.సాయిబాబు, బి. సుమన్‌ప్రకాశ్, ఏఎం అనూరాధ ఆధ్వర్యంలో శనివారం రెడ్డి వివాహ పరిచయ వేదికను నిర్వహించారు. ఈ వేదికలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అనేక మంది యువతీయువకులు పాల్గొని వివాహ సంబంధాలు కుదుర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ పులియాల హరిందర్‌రెడ్డి పాల్గొన్నారు. **- కాచిగూడ, ఏప్రిల్ 6**

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

గోల్నాక డివిజన్ అశోక్‌నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ (జంక్షన్) వద్ద శనివారం మధ్యాహ్నం మంటలు చలరేగాయి. చూసిన స్థానికులు ఫైర్ ఇంజిన్, ట్రాన్స్‌కో అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ట్రాన్స్‌కో ఏఈ ప్రసాద్, డీఈ సీనయ్య సిబ్బందితో వచ్చారు. అప్పటికే చుట్టూ ఉన్న వైర్లు కాలిపోయాయి. ఫైర్ ఇంజిన్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. బీఆర్ఎస్ నాయకులు సంతోష్, దామోదర్, శ్రీనివాస్, వెంకట్, రాజేశ్, శంకర్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆదేశాల మేరకు అక్కడకు చేరుకొని మరమ్మతులు చేయించారు. **- అంబర్‌పేట**

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

కాచిగూడ,ఏప్రిల్ 6 : డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్సై డి.సుభాష్ తెలిపిన ప్రకారం.. బర్కత్‌పురకు చెందిన నవ్యశ్రీ (20) కేశవ మెమోరియల్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుంది. ప్రేమ విఫలమై.. మనస్థాపంతో శనివారం ప్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు కాచిగూడ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

కవాడిగూడ, ఏప్రిల్ 6: ఇంటి నిర్మాణ విషయంలో జోక్యం చేసుకోవడమే కాకుండా కులంపేరుతో దూషిస్తూ దాడులకు పాల్పడ్డారని వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం, హరిదాస్‌పల్లికి చెందిన పటోళ్ల రాజేందర్‌రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని శనివారం ఎస్టీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు అదే గ్రామానికి చెందిన గట్టిపల్లి రాజు తెలిపారు. బాధితుడు గట్టిపల్లి రాజుకు ధర్మా సమాజ్ పార్టీ ఉమ్మడి హైదరాబాద్ జిల్లా నాయకులు కృష్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేంద్ర ముదిరాజు, సంతోష్ మహారాజు, వికారాబాద్ జిల్లా నాయకులు మల్లికార్జున్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సాంస్కృతిక పురోగతికి ప్రభుత్వాలు కృషి చేయాలి

తెలుగు యూనివర్సిటీ / సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 6 : సాంస్కృతిక పురోగతి కోసం ప్రభుత్వాలు కల్చరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఇంద్రజాలికులు, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు సామల వేణు నేతృత్వంలో 'తెలంగాణ కల్చరల్ పాలసీ' పై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నృత్య గురువు కళాకృష్ణ, నాటక రచయిత, దర్శకులు, నటులు గుమ్మడి గోపాలకృష్ణ, వడ్డేపల్లి కృష్ణ, తెలుగు వర్సిటీ థియేటర్స్ ఆర్ట్స్ డీన్ కె. హనుమంతరావు నృత్య గురువులు డాక్టర్ కె. అనిత, మృణాళిని, సంగీత గురువులు ఈలపాటి వెంకటరమణారెడ్డి, పాండురంగ ముతాలిక్, ఫ్లూట్ నాగరాజ్, డాక్టర్ విజయ్ కుమార్, వరల్డ్ తెలుగు ఫెడరేషన్ కార్యదర్శి టీవీ సాయి పాల్గొని పలు అంశాలపై చర్చించి ప్రభుత్వాలకు సూచనలతో కూడిన వినతి పత్రాలను రూపొందించారు. కార్పొరేషన్‌కు చైర్మన్లను నియమించి సలహా మండలిని ఏర్పాటు చేయాలని కోరారు.



తెలంగాణ కల్చరల్ పాలసీ సదస్సులో పాల్గొన్న వక్తలు

గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 6: గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పలువురు వక్తలు అన్నారు. గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1997 ఏప్రిల్ 6న గద్దర్‌పై కాల్పులు జరిగిన రోజు సందర్భంగా ' బావ ప్రకటన పాలకుల అణిచివేత గాయపడ్డ పాట' పేరుతో 'పాటపై తూటా' సభను శనివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, అంబేద్కరిస్ట్ జేబీ రాజు, పాశం యాదగిరి, విమలక్క హాజరై గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఫౌండేషన్ సభ్యుడు డాక్టర్ సంఘంరెడ్డి పృథ్వీరాజ్‌యాదవ్ అధ్యక్షత వహించిన ఈ సభలో ఫౌండేషన్ సభ్యులు గుమ్మడి విఠల్ సూర్యకిరణ్, గుమ్మడి విమల, డాక్టర్ జిలకర శ్రీనివాస్, ఎం.వి. ఫౌండేషన్ ఆర్.వెంకట్‌రెడ్డి, గద్దర్ అభిమాన సంఘం నాయకులు సీఎం యాదగిరి, సీపీఎం నాయకుడు సాగర్, యశ్‌పాల్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 6. ఇంటర్ పరీక్ష రాసేందుకు వెళ్లిన ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన బేగంబజార్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ సాయితేజరెడ్డి తెలిపిన ప్రకారం.. ఎంఎస్ మక్తా సోమాజిగూడకు చెందిన అఫ్రీన్ బేగం(19) మహబూబియా కళాశాలలో ఒకేషనల్ కోర్సులో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. కాగా మార్చి 11న ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాసేందుకు నాంపల్లిలోని సరోజిని మహా విద్యాలయానికి ఉ. 8.30 గంటలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లి నజీమా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బిల్ కలెక్టర్లందరికీ జీవో నం.11 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

కవాడిగూడ, ఏప్రిల్ 6: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం వల్ల 650 మంది విద్యుత్ బిల్ కలెక్టర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉన్నదని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.స్వామి మాట్లాడుతూ.. బిల్ కలెక్టర్లందరికీ లేబర్ కమిషన్ ఇచ్చిన జీవో నం.11 ప్రకారం, వేతనాలు ఇవ్వాలని అన్నారు. 25 ఏండ్లుగా పనిచేస్తున్న వారు ఉద్యోగాలు కోల్పోవడంతో వారు బజారున పడ్డారన్నారు. వారికి ఉద్యోగావకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కృష్ణ య్య, లక్ష్మయ్య, రమేశ్, రాజేశ్వరి, ఆశాలత, సోమేష్‌లతో పాటు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ నాగేందర్ నేతృత్వంలో వరల్డ్ స్కిన్ హెల్త్ డే సందర్భంగా డీవీఎల్, ఐఏడీవీఎల్ టీఎస్ ఆధ్వర్యంలో ' ఆల్ స్కిన్ కలర్స్ ఆర్ బ్యూటిఫుల్ ఫర్ స్కిన్' పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. **- సుల్తాన్‌బజార్**

బీజేపీ 44వ అవిర్భావ దినోత్సవం

అబిడ్స్ / కాచిగూడ,ఏప్రిల్ 6 : బీజేపీ 44వ అవిర్భావ దినోత్సవం సందర్భంగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు, కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్, ఆనంద్‌గౌడ్, మాజీ మంత్రి కృష్ణయాదవ్, కన్నె రమేశ్‌యాదవ్ కార్యకర్తలతో కలిసి శనివారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. గోషామహల్ నియోజకవర్గం మంగళ్‌హాట్ డివిజన్‌లో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బబ్లూగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

యాదాద్రి పుణ్యక్షేత్రం అఖిల భారత పద్మశాలి సత్రం ప్రధాన కార్యదర్శిగా దేవదాసు

చిక్కడపల్లి, ఏప్రిల్ 6 : యాదాద్రి పుణ్యక్షేత్రం అఖిల భారత పద్మశాలి సత్రం ప్రధాన కార్యదర్శిగా సంఘ సేవకుడు, చేనేత సామాజిక ఉద్యమ నాయకుడు డాక్టర్ చిక్కా దేవదాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. న్యాయవాదులు చి. చంద్రయ్య, బూరం శంకర్, బిల్ల ఉప్పలయ్య ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

కార్పొరేటర్ పాదయాత్ర

అంబర్‌పేట డివిజన్ పటేల్ నగర్‌లో శనివారం కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ పాదయాత్ర నిర్వహించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. త్వరలోనే కొత్త సీసీ రోడ్డు వేయిస్తున్నామని తెలిపారు. కార్పొరేటర్ వెంట బీఆర్ఎస్ నాయకుడు లవంగు ఆంజనేయులు ఉన్నారు.

- గోల్నాక, ఏప్రిల్ 6

తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉదయశ్రీ రెడ్డి

అబిడ్స్, ఏప్రిల్ 6 : తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇట్టా ఉదయశ్రీ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. టీసీసీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఉదయశ్రీని ఎన్నుకున్నట్లు తెలిపారు. నాంపల్లి ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉదయశ్రీ 20 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ శాంతి, మతసామరస్యం కొరకు కృషి చేయడంతో కౌన్సిల్ ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆయన తెలిపారు.